


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం| 29 ఆగస్టు 2025

పేజీలు 8


## రూపాయికి పడిపోయిన ఉల్లిధర

- వారం రోజుల నుండి కర్నూలు మార్కెట్‌యార్డులో రైతుల ఎదురుచూపు
- యార్డులో రైతులకు ధైర్యం చెప్పిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి మోహన్‌రెడ్డి

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** కర్నూలు మార్కెట్‌యార్డులో ఉల్లికి గడ్డ పరిస్థితులు ఎదురయ్యాయి. కేవలం ఒక్క రూపాయికి కిలో చొప్పున అడుగుతున్న పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మేందుకు వస్తే వారం రోజులైనా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆర్థనాధాలు చేస్తున్నారు. కష్టపడించిన పంటను అమ్మితే కనీసం ఆటో, ట్రాక్టర్ బాడిగలకు రావడం లేదని వాపోయారు. ఎకరా ఉల్లిని పండించడానికి రూ.1లక్ష నుండి రూ.1లక్ష30వేలు అవుతుందని, పంట దిగుబడి 50నుండి 70క్వింటాళ్లు వచ్చినా క్వింటం రూ.100లు నుండి రూ.300లు మాత్రమే పలుకుతుందని వాపోయారు. ఒక ఎకరాకి

మిగతా 2లో



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్‌రెడ్డి

## రైతు కష్టం.. వరుణుడి పాలు

- ఉల్లి రైతులకు తీరని నష్టం
- మళ్లీ వర్షాలు..భయాందోళనల్లో రైతులు
- మార్కెట్‌కు తరలించే సమయానికి వీడకుండా వానలు
- సాగులో ఉన్న పంటల పైనా వరుణుడి ప్రభావం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** శ్రమించి పండించిన పంటలు వరుణుడి పాల పడి కుళ్లిపోతున్నాయి. ఆగస్టు నెలలో భారీ వర్షాలు రైతుకు తీరని నష్టం తెస్తున్నాయి. ఆగస్టు నెల ప్రారంభమైన రోజు నుండి మధ్యలో కొద్దిగా తెరిపినిచ్చినా అల్పపీడనాలు వెంటాడుతుండడంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వర్షాలువీడడం లేదు. చెరువులు, వాగులు, వంకలు, నదులు వర్షపు నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. అలాగే పంట చేలు కూడా వర్షపు నీటిలో మునిగి తేలుతున్నాయి. పంట చేతికొచ్చే సమయానికి కురుస్తున్న వర్షాలతో ఉల్లి కుళ్లిపోతోంది. వేరుశనగ పంట ఉత్పత్తులపై

మిగతా 2లో



## మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించాం

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్



**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** ప్రతిపక్ష పార్టీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేసిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. డీఎస్సీ పోస్టుల భర్తీపై మంత్రి టి.జి భరత్ ఒక ప్రకటన విడుదల చేశారు. పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించామని,ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతోవిద్య రంగాన్ని

మిగతా 2లో

## సూపర్ సిక్స్..సూపర్ హిట్

- స్త్రీశక్తి ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన మహిళలు




సభను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

## విశేష పూజలందుకున్న విఘ్నేశ్వరుడు

- నగరంలో కొలువుదీరిన గణనాథులు
- పూజల్లో పాల్గొన్న ఆయా పార్టీల నాయకులు,అధికారులు

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** వినాయక చవితి పండుగ సందర్భంగా బుధవారం నగరంలో కొలువుదీరిన గణనాథులు విశేష పూజలు అందుకున్నారు. ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిగతా 2లో



పూజల్లో పాల్గొన్న టీజీ వెంకటేష్, టీజీ భరత్‌లు

## జ్ఞానప్రదాత బొజ్జ గణపయ్యకు జేజేలు



బాలాజీ కాంప్లెక్స్‌లో ఆకట్టుకుంటున్న సప్తగవ్వల గణపతి ప్రతిమ

- మండపాల వద్ద వినాయక చవితి ఉత్సవాలు
- చిన్నారులు,పెద్దల్లో ఉత్సాహం
- వేడుకగా కొనసాగుతున్న మహాగణపతికి పూజలు

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** సృష్టిలో దేవతలైనా. ..మానవులైనా ఎవరైనా సరే ముందుగా మహాగణపతికి పూజ చేస్తేనే ఫలం సిద్ధిస్తుందని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. గణపతికి చెందిన ఎన్నో సినిమాలు, కథలు విన్నాం. కొలిచిన వారికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడని.. ఆయన పూజలేని వ్రతాలు ఏవి ఉండవు. అందుకే వినాయక

మిగతా 7లో



కలెక్టర్ కార్యాలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి, కుటుంబ సభ్యులు

## కెఎంసిలో మొదలైన ప్రక్షాళన

- విధుల్లో అవినీతి,అలసత్వానికి పాల్పడితే చర్యలు తప్పవు
- కర్నూలు మున్సిపల్ కమీషనర్ విశ్వనాథ్




మున్సిపల్ కార్యాలయం

# రూపాయికి పడిపోయిన ఉల్లి ధర

(మొదటి పేజి తరువాయి)



వైసిపి నాయకులతో వాపోతున్న ఉల్లి రైతులు

రూ. 1లక్ష పెట్టుబడి పెడితే రూ. 30 వేలు మాత్రమే చేతికి వస్తుందని కన్నీటి పర్యాంతమయ్యారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉల్లి ధరలు తగ్గితే ప్రభుత్వమే కొనుగోలు చేసి రాష్ట్రంలో అన్ని రైతుబజార్‌లకు సరఫరా చేయించి ఆదుకుంది. కానీ కూటమి ప్రభుత్వం ఆ విధంగా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఒకవైపు ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి కష్టపడి పంటను మార్కెట్‌కు తెస్తే కనీసం కూలీ ఖర్చులు రాని దుస్థితి నెలకొందన్నారు. మార్కెట్‌యార్డు నుంచి ఇంటికి ఎలా వెళ్లాలో..అప్పులు ఎలా కట్టాలో..తమకు ఆత్మహత్యలే శరణ్యమని వైసిపి నాయకులతో అన్నదాతలు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ మీరు భయపడకండి రైతులకు వైసిపి పార్టీ అండగా ఉంటుందని మీ తరుపున పోరాటం చేస్తామని ధైర్యం చెప్పారు. గతంలో పొగాకు ధర తగ్గితే ఒంగోలులో పొగాకు రైతులను పరామర్శించి అప్పుడు ప్రభుత్వం మేల్కొందని, మిర్చి ధర పడిపోతే జగన్‌మోహన్ రెడ్డి గుంటూరు మార్కెట్‌యార్డుకు వెళితే ప్రభుత్వం కదిలిందని, మామిడి ధర పడిపోతే రైతులను జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శిస్తే కేంద్ర ప్రభుత్వం కదిలిందని కావున ఉల్లి రైతుల కోసం జగన్‌మోహన్ రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉల్లిని రూ. 2వేల నుండి రూ. 5వేల వరకు కొనుగోలు చేసి రైతు బజార్‌లో విక్రయించాలని డిమాండ్ చేశారు. రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ప్రధానంగా ఉల్లి పంట సాగు చేస్తారని రాష్ట్రంలోనే సాగులో 90శాతం కర్నూలులో జరుగుతుందన్నారు. కర్నూలుకు వచ్చే మొట్టమొదటి పంట ఉల్లినే అని సీజన్ మొదట్లోనే ఈ పరిస్థితి ఉంటే ఇంకా 50రోజులు మార్కెట్‌కు ఉల్లి వస్తుందని వారం రోజుల నుండి అష్టకష్టాలు పడుతున్న రైతులకు కనీసం ప్రభుత్వం కానీ, అధికారులు కానీ పరామర్శించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఉల్లిని కొనుగోలు చేసి రైతులను ఆత్మహత్యల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, నాయకులు మల్లికార్జున, తిరుమలేష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, షరీఫ్, కార్పొరేటర్ మునెమ్మ, ఉల్లి రైతులు పాల్గొన్నారు.

# కెఎంసిలో మొదలైన ప్రక్షాళన

**కర్నూలు(కెఎంసి),మేజర్‌న్యూస్ :** కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రక్షాళన మొదలైంది. విధుల్లో అవినీతి, అలసత్వం ప్రదర్శిస్తున్న కొందరిపై మున్సిపల్ కమీషనర్ పి విశ్వనాథ్ చర్యలు చేపట్టారు. కార్పొరేషన్‌లో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ సెక్షన్‌లలో కొన్నేళ్లుగా ఒకే సీటులో ఉంటూ వివిధ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిని గుర్తించి వారిపై చర్యల్లో భాగంగా ఒకే చోట ఉన్న వారందరిని వివిధ సెక్షన్‌లలో విధులను మార్పు చేయడం జరిగిందని కమీషనర్ గురువారం తెలిపారు. బదిలీ అయిన వారు ఇప్పటికైనా తమ సీట్లలో ప్రజలకు సరైన సేవలు అందించాలని లేనిచో చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఏం జరుగుతుందో తెలియక ఉదయం నుంచి ఆందోళన చెందారు.

# రైతు కష్టం..వరుణుడి పాలు

(మొదటి పేజి తరువాయి)

కూడా వర్షపు ప్రభావం పడింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు కొత్త ఆశలతో వేసిన విత్తనాలు మొలక దశలో ఉండగానే వర్షాల దెబ్బ పడింది. నాలుగైదు రోజులు తెరిపినిచ్చినట్లు కనిపించినా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతన్న నడ్డి విరిచాయి. ఆగస్టు నెలలో నెలసరి వర్షపాతం 101.2 మిల్లీమీటర్లుండగా, ఇప్పటి వరకు 196.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ నెలలో సాధారణ వర్షపాతాన్ని మించి వర్షాలు కురిసినట్లు రికార్డులు చెబుతున్నా కొద్ది మండలాల్లో వర్షాభావం కూడా నెలకొన్న ఛాయలు కనిపిస్తున్నాయి. వర్షపు నీటితో తడిచిన ఉల్లినే రైతులు నేరుగా మార్కెట్‌కు తరలిస్తున్న కారణంగా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. మంచి ధర వచ్చే వరకు వాటిని దాచుకుందామన్నా సరైన సౌకర్యాలు లేని కారణంగా రైతులు ఉల్లిని అయిన కాడికి అమ్మేసుకుంటున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో 50 కేజీల ఉల్లి బస్తా 250 రూపాయలు పలుకుతోంది. క్వింటాలు 100 రూపాయలకు అమ్ముకున్న రైతులున్నారు. సహజంగా కర్నూలు జిల్లాలో పండే ఉల్లిని ఒరిస్సా, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ ఏడాది వరుణుడి ప్రభావం కారణంగా తడిచిపోయిన ఉల్లిని చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు ప్రయత్నించినా ధర రాకపోగా, రానుపోను ఖర్చులు కూడా మిగలని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలన్నీ వర్షాల కారణంగా పతనం దిశగా పయనిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం కిలో 60 నుండి 80 రూపాయలు పలికిన పచ్చిమిర్చి ధర ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లోనే 25 రూపాయలకు మించడం లేదు. అలాగే టమోటా ధర కూడా పతనమైంది. టమోటా మార్కెట్‌లో 10 నుండి 15 రూపాయలు పలుకుతోంది. ఆకుకూరలు, ఇతరత్రా కూరగాయల ధరలు మునుపెన్నడూ లేని విధంగా పడిపోయాయి.

కర్నూలు మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున ఉల్లి చేరుతోంది. గురువారం స్థానిక మార్కెట్ యార్డుకు 3,790 క్వింటాళ్ల ఉల్లికి టెండర్లు నిర్వహించగా, 3,113 క్వింటాళ్ల ఉల్లి అమ్మకాలు జరిగాయని, 680 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌లో మిగిలిపోయిందని కార్యదర్శి జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుల ఆదేశం మేరకు కర్నూలు పట్టణంలోని రైతు బజారుతో పాటు విశాఖ, ఒంగోలు, నెల్లూరు పట్టణాలకు పదేసి టన్నుల చొప్పున పంపించామని ఆమె చెప్పారు. రైతులు మార్కెట్‌కు సరుకు తీసుకువచ్చే సమయానికి గ్రేడింగ్ చేసి శుభ్రం చేసుకుని వస్తే మంచి ధర వస్తుందని ఆమె రైతులకు సూచించారు. ఉల్లి రైతును ఆదుకునేందుకు క్వింటాల్ ఉల్లిని 1200 రూపాయలకు కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించినట్లు వార్తలు వస్తున్నా లిఖిత పూర్వకంగా తమకు అందలేదని మార్కెట్ యార్డు కార్యదర్శి జయలక్ష్మి చెప్పారు. ఈ ఏడాది రైతులకు చేదు అనుభవం తప్పడం లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చేతికొచ్చిన పంటను అయిన కాడికి అమ్ముకోవలసిన దుస్థితి నెలకొనగా, మరోవైపు పొలాల్లో మొలక దశలో కుళ్లిపోతున్న పంటను చూసి రైతులకు కన్నీరు కూడా కరవవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో హృదయ విదారకమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

# మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించాం

(మొదటి పేజి తరువాయి)

దేశంలోనే తొలిస్థానంలో నిలబెడతామన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇచ్చి వారికీ అండగా నిలబడ్డామని పేర్కొన్నారు. అయితే యువత బాగుపడటం ఇష్టంలేని ప్రతిపక్ష నేత మెగా డీఎస్సీని ఆపేందుకు 24 కేసులు వేయించాడన్నారు. అవన్నీ తట్టుకొని మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగు పర్చేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు నూతన వెలుగులు తెస్తున్నామన్నారు. 2014-2019 మధ్య 2 డీఎస్సీలు జరిపి 18వేల ఉపాధ్యాయ పోస్టులను తెలుగుదేశం ప్రభుత్వం భర్తీ చేసిందని మంత్రి టి.జి భరత్ తెలిపా రు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 729 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించిం దని, 700 కోయభారతి టీచర్‌పోస్టులుభర్తీ చేశామన్నారు. జూనియర్ కాలేజీల్లో 700 మంది సిబ్బంది సేవలు పునరుద్ధరణ చేశామని, 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3619 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు పునరుద్ధరణ చేశామన్నారు. టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు గత ప్రభుత్వంలో ఆరు రకాల బడుల విధానం ఉండగా.. తమ కూటమి ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల బడులుగా మార్చిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థను గొప్పగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు.

# విశేష పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



సావనీర్‌ను ఆవిష్కరించిన జెసి. నవ్య

**పాలనా గణపతికి పూజలు చేసిన జెసి :-** నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరిపాలన వినాయకుడికి జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజలు వినాయకుడి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని జెసి కోరుకున్నారు. ఈ పూజా కార్యక్రమానికిజిల్లా,పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొని గత ఏడాది గణేష్ ఉత్సవ సావనీర్‌ను జెసిచే ఆవిష్కరింపచేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఏఓ శివరాముడు, తహశీల్దార్లు శ్రీనాథ్, వెంకటేశ్వర్లు, ఏపి ఆర్ఎస్ఏ అధ్యక్షుడు నాగరాజు, స్పోర్ట్స్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి,ఉమెన్స్ వింగ్ అధ్యక్షులు సహారా బాను, డిటీలు జగదీష్, వెంకటేశ్వర్లు, జనార్థన్ నాయక్, పరిపాలన వినాయక సభ్యులు, జిల్లా, పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


**పాత్రికేయ గణేష్ ఉత్సవ సమితి ఆద్వర్యంలో:-** నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సమాచార శాఖ భవన్ నందు పాత్రికేయ



కలెక్టరేట్‌లో కొలువుదీరిన పాత్రికేయ గణపతి

గణేష్ ఉత్సవ సమితి ఆద్వర్యంలో 12 అడుగుల మట్టి వినాయకుడిని రెండోసారి నెలకొల్పారు. ఉత్సవ సమితి ఆద్వర్యంలో వ్యాపార వేత్త మహబూబ్ బాషా, ఉత్సవ సమితి నాయకులు మంజునాథ్ యాదవ్, ఎన్‌వి సుబ్బయ్య, సాయికుమార్ నాయుడు, రామకృష్ణ, ప్రకాష్, సాగర్, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరుల ఆద్వర్యంలోప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు అందచేశారు. గురువారం శంకరాస్ డిగ్రీ కాలేజీ, బిసి విద్యార్థి సంఘాల నాయకులు కోనేటి వెంకటేశ్వర్లు, ఆనంద్ తదితరుల ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**కాంగ్రెస్ కార్యాలయంలో :-** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడికి మాజీ ఎమ్మెల్సీ, మాజీ డిసిసి అధ్యక్షులు ఎం సుధాకర్ బాబులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు బజారన్న, బతుకన్న, వెంకటరె డ్డి, ప్రతాప్, కేశవరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.




టిడిపి కార్యాలయంలో వినాయకుడికి పూజలు

**టిడిపి కార్యాలయంలో :-** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డిసిఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, జి పుల్లయ్య, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ దరూర్ జేమ్స్, యస్ అబ్బాస్, బేత క్రిష్ణుడు, గున్న మార్క్, సత్రం రామక్రిష్ణుడు, వైనరసింహులు,షేక్షా పాల్గొన్నారు.

**టీజీవి గ్రూప్ పరిశ్రమల్లో :-** ఈ తాండ్రపాడులో టీజీవి గ్రూప్ పరిశ్రమల్లో భాగమైన ఎస్ఆర్ఏఏసి, ఎస్ఆర్‌హెచ్‌హెచ్ఎల్ పరిశ్రమలలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను టీజీవి గ్రూపు సంస్థల అధినేతలైన రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌లు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్‌లు మాట్లాడుతూ ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసి, ఆ వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరుసుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

నగరంలోని వన్‌టౌన్ పరిధిలో శ్రీ బాల వీరాంజనేయ స్వామి సేవా సంఘం గణనాథుడికి, నగరంలోని చిత్తారివీధి రాంపట్ల దేవాలయం దగ్గర గణేష్‌లకు వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి, వైసిపి రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వి విజయ మనోహరి, నాయకుడు ఎస్‌వి జనక్ దత్తా రెడ్డిలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెదేపా జిల్లా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీ పద్మాచౌదరిలు వారి స్వగృహం నందు ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించిన సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.



# చంద్రబాబు పాలన అంతా మోసపూరితం

- ఇచ్చిన ఆరు హామీలు అందించలేకపోతున్నారు
- అరకొర పథకాలు అమలు
- అంతరాష్ట్ర బస్సులంటూ నదీతీర గ్రామాల మహిళలకు టోకరా



బాబుషూరిటీ మోసం గ్యారంటీ అంటూ ప్రచారం చేస్తున్న దృశ్యం

**నందవరం, మేజర్‌న్యూస్ :** కూటమి పాలనలో ముఖ్యంత్రిగా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మోసపూరిత పాలన అందిస్తున్నారని , ఎన్నికల ముందు ప్రజలకు అందిస్తానన్నారు హామీలు 14 నెలల పాలన గడిచినా అందించకుండా నిలువునా ముంచేస్తున్నారని వైకాపా మేదావులఫోరం రాష్ట్ర నాయకులు కెఆర్ లక్ష్మికాంతరె డ్డి, బిసి సెల్ రాష్ట్ర నాయకులు విరుపాక్షిరెడ్డి, నియోజకవర్గం రైతు విభాగం నాయకులు వెంకటేశ్వరరెడ్డిలు తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం వైకాపా మండల పార్టీ కన్వినర్ శివారెడ్డిగౌడు ఆద్వర్యంలో వైకాపా ఇంచార్జ్ బుట్టా రేణుక ఆదేశాల మేరకు బాబుషూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో బాగంగా నందవరం మండలం గురజాల శ్రీ రామలింగేశ్వర ఆలయంలో ముందుగా పూజలు చేపట్టి గురజాల, రాయచోటి గ్రామాల్లో ఇంటింటా కూటమి పాలన మోసాలను ఎండగడుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఆరు హామీల్లో 14 నెలలకు 3 హామీలు అరకొరగా నెరవేర్చి అన్ని హామీలు అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని సూపర్ సిక్స్ పథకాలు అట్టర్ ఫ్లాప్ అయిపోయ్యాయని దుయ్యబట్టారు. శ్రీ శక్తి ఉచిత బస్సు అంటూనే అంతరాష్ట్ర సర్వీసుల అంటూ తుంగబద్ర నదీతీర వెంట ఉన్న గ్రామాలు మహిళలు కనీసం పల్లెవెలుగు బస్సులో ఉచితంగా బస్సు ప్రయాణం చెయ్యలేక పోతున్నారని విమర్శించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులు ఉన్న నేపద్యంలో మహిళలకు ఉచిత బస్సును అందని ద్రాక్షలాగా అమలు పరుస్తున్నారని ఆరోపించారు. రాయజోటి గ్రామంలో ఉల్లి పంటను పరిశీలిచిన వారు ఉల్లి రైతు భాదలు పట్టించుకున్న పాపాన ప్రభుత్వాలు లేవన్నారు. అధిక వర్షాలకు దిగుబడులు తగ్గి, ధరల లేక అప్పులలో కూరుకు పోతున్న రైతాంగానికి మద్దతు ధరలు అందించాలన్నారు. లేని పక్షాన పంటల బీమాను అందించి ఆదుకోవాలని ప్రబుత్వాన్ని రైతుల తరుపున డిమాండ్ చేశారు. జగనన్న పోరాటాలతోనే అమ్మకు వందరం, అన్నదాత సుఖీభవ, శ్రీ శక్తి , గ్యాస్‌బండ ఉచితాలకు అరకొరగా అందించి చేతులు దులుపుకున్నారన్నారు. ఇకనూ బడుగులకు 50 ఏళ్లకు పెన్షన్లు, మూడు వేలు నిరుద్యోగబృతి, 20 లక్షల ఉద్యోగలు, 18 ఏళ్లు నిందిన మహిళలకు1500 రూపాయల నెలసరి చేయుత ఎన్నడు అందిస్తారు బాబు అంటూ ప్రశ్నించారు. వికలాంగులకు కుంటి సాకులతో లక్ష ఇరవై వేలు పెన్షన్లు తొలిగిండమా సూపర్ పాలన అంటే అంటూ దుయ్యబట్టారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి , ఎంపిటిసి అతపుల్లా, గురజాల నరసింహారెడ్డి, కరె రమేష్, పల్లె సోమశంకర్‌రెడ్డి , పల్లె రంగారెడ్డి, రాయచోటి నరసింహారెడ్డి, గంగవరం శివన్న, రాముడు, జాన్, నాగలదిన్నె, తిమ్మప్ప, ప్రభాకర్, నాగప్ప, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ సంఖ్యలో తరలివెళ్ళిన టిడిపి శ్రేణులు




**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** సూపర్ సిక్స్. ...సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ప్యాపిలి మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో డోన్ మండల కేంద్రానికి తరలివెళ్ళారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించినందుకు సంతోషంతో ముఖ్యమంత్రి థ్యాంక్యూ సార్ అభినందన సభకు ప్యాపిలి మండల నుండి ప్యాపిలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి కొత్తబస్టాండ్ వరకు మహిళలతో భారీ ర్యాలీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాపిలి మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గడ్డం అంకిరెడ్డి, ఖాజాపీరా, తొప్పెల శ్రీనివాసులు, కొంగనపల్లె మధు, చల్లా వీరాంజినేయులు, పెద్దపూదిళ్ళ ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మధు, గుడిపాడు వెంకటరెడ్డి, దానం మధు, రామ్మోహన్‌యాదవ్, నడిగడ్డ నాగేంద్ర, చల్లా అనుదీప్, ఎస్‌కె.వలి, బ్యాంక్ శీను, వెంకటేష్, గండికోట రమేష్, మాధవరం రాము, బోయిన్‌చెరువుపల్లె కాంతారావు, విశ్వనాథ్‌యాదవ్, సయ్యద్‌అక్బర్‌వలి, పగడాల రాజేష్, చంద్రశేఖర్, దూదేకుల మహ్మద్‌రఫీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకల్లో కూటమి నాయకుల సందడి



**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ యువ నేత మారుతి నాయుడు ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదోని నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఆదోని జనసేన పార్టీ ఇంచార్జ్ మల్లప్ప, బీజేపీ నాయకులు విట్టా రమేష్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పలు బుధవారం ఎమ్మిగనూరు జాతీయ రహదారి (బైపాస్ రోడ్డు)లోని స్థానిక మారుతి నాయుడు కార్యాలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా వారు వినాయకుని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. వీరితో పాటు ఆదోని డీఎస్పీ హేమలత పలువురు పోలీస్ అధికారులు, తెదేపా నాయకులు భూపాల్ చౌదరి, వెంకటేష్ చౌదరి, రామస్వామి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, జయరాం, వీరేష్ లు వినాయకున్ని దర్శించుకున్న వారిలో ఉన్నారు. మారుతి నాయుడు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గణనాధునికి అర్చకులచే ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ బదిలీపై వెళ్లగా జూపాడుబంగ్లా నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జునను మండల పరిధిలోని తర్తూరు గ్రామ టీడీపీ నాయకులు సిఎం రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు గౌడులు పోలీసు స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జునను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని బుక్కాపురం ఎరువుల దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. గురువారం తహశీల్దార్ రమాదేవి, ఎస్సై రామ్మోహన్ రెడ్డి, ఏఓ నాగేశ్వర్ రెడ్డిలు తనిఖీలు నిర్వహించి పలు రిజిస్టర్లను పరిశీలించారు. యూరియా ఎరువులను, ఇతర రసాయన ఎరువులను ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే లైసెన్స్ రద్దు చేయాలని తెలిపారు. స్టాక్‌ను డిస్ప్లేలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అన్నారు. గోదాములు పరిశీలించి సూచనలు చేశారు.

## ఆశపడి దళారుల చేతిలో మోసపోవద్దు

### బాధిత రైతులకు భరోసా కల్పించిన సిఐ శ్రీనివాసులు



బాధిత రైతులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు రెడ్డి

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** అధిక రేట్లకు ఆశపడి తమ పంటను దళారులకు అమ్ముకొని వారి చేతిలో మోసపోవద్దని నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. ఇటీవల మండలంలోని నారాయణపురం చిన్నదేవలాపురం గ్రామాలకు చెందిన రైతులను సుమారు రూ.3.60 కోట్ల రూపాయలు దళారుల చేతిలో మోసపోయిన రైతులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో బాధిత రైతుల తో సిఐ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ అధిక ధరలకు అమ్ముకోవచ్చని ఆశతో రైతులను మోసం చేసే దళారులను నమ్మవద్దని తెలిపారు. కష్టపడి పండించిన పంటను నమ్మకమైన వ్యక్తులకు లావాదేవులపై భరోసా ఉన్న వ్యాపారస్తులకు అమ్ముకోవాలని కోరారు. నారాయ ణపురం చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన బాధిత రైతు కుటుంబాలకు చట్టపరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అంతకంటే ముందు శుక్రవారం జరగబోయే గణేష్ నిమజ్జన కార్యక్ర మాలపై స్థానిక ఎస్సై జగన్మోహన్,సిబంది తో సమీక్ష జరిపారు ఎలాంటి అమాంజినేయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు గణేష్ నిమజ్జనాన్ని చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు ప్రేరేపించి అల్లలు ఘర్షణ వాతావరణం సృష్టిస్తే నిర్వాహకులతో పాటు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా దివ్యాంగుల ఆవిర్భావ దినోత్సవం



**బండి ఆత్మకూరు రూరల్,మేజర్ న్యూస్ :** బండి ఆత్మకూరు మండలంలో వికలాంగుల 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.మాదిగల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకటసుబ్బన్న ఆధ్వర్యంలో అధ్యక్షుడు బిజ్జం వెంకట సుబ్బా రెడ్డి కేక్ కటింగ్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ గారు వికలాంగుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఆయన పోరాట ఫలితమే ఈరోజు వికలాంగులకు పెన్షన్ 6000 రూపాయలు తీసుకుంటున్నారని అన్నారు.వికలాంగుల సమస్యలే కాకుండా సమాజంలో ప్రతి ప్రజా సమస్యలకు పోరాటం చేస్తూ అందరికీ న్యాయం చేసేలాగ పోరాటం చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల మండల అధ్యక్షురాలు రమ్యబి, మండల ఉపాధ్యక్షుడు రామచంద్రుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇతిహాజు, లాల్ బాషా, నాగమ్మ, తిరుపాలు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి



మృతి చెందిన రైతు రామానాయుడు(33) (ఫైల్‌ఫోటో)

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రామళ్ళకోట గ్రామానికి చెందిన రైతు కొట్టం రామానాయుడు(33) తన పొలంలోని బోరు మోటార్ ఆఫ్ చేసే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. బుధవారం సాయంత్రం జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రైతు రామానాయుడు తన భార్య పద్మావతితో కలిసి మల్లెపల్లి పొలిమేరలలో గల తన కొండ పొలానికి వెళ్ళారు. ఆ పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటకు బోరు మోటార్‌తో నీరు వదిలాడు. సాయంత్రం భార్య ఇంటికి వెళ్ళగా తాను పొలం పని పూర్తి చేసుకొని బోరు మోటార్ ఆఫ్ చేసే ప్రయ త్నంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికి అక్కడే పడిపోయాడు. ఇంటికి రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు రాత్రి వెళ్ళి చూడగా బోరు మోటార్ వద్ద పడిపోయి కనిపించాడు. కుటుంబ సభ్యులు రామానాయుడిని మండల కేంద్రంలోని సిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. గురువారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్దుర్తి ఎస్సై అశోక్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టంకు ఆదేశించి, స్థానిక సిహెచ్‌సిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి అతని గ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు రామానాయుడు మృతి పట్ల గ్రామ పెద్దలు తమ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరారు.

## బొల్లవరంలో కూలిన మట్టి మిద్దె.. – తప్పిన ప్రమాదం

**మహానంది, మేజర్‌న్యూస్ :** వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా బొల్లవరం గ్రామంలో మట్టి మిద్దె కూలింది. గురువారం తెల్లవారుజామున రామయ్య ఆచారికి చెందిన మట్టి మిద్దె కూలిపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆ సమయంలో వారు ఇంటి బయట నిద్రిస్తుండటంతో ప్రాణాపాయం తప్పిందని చాలా పేద కుటుంబానికి చెందిన రామయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కూలిన మట్టి మిద్దె వద్ద రామయ్య

సూర్య
www.suryaa.com



# ప్రారంభమైన డిఎస్సి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ



అభ్యర్థులకు సూచనలిస్తున్న జెసి, డిఈఓలు

**– మూడు కేంద్రాలలో ఏర్పాటు**

**– తనిఖీ చేసిన జెసి, ఎస్సిఈఆర్టి డైరెక్టర్**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** డిఎస్సి సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం జిల్లా విద్యా శాఖ నిర్దేశించిన మూడు ప్రాంతాల లో ప్రారంభమైంది. ప్రారంభ సమయంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ప్రతాప్ రెడ్డి, అబ్రహం, కర్నూలు, నంద్యాల డిఈఓలు శామ్యూల్ పాల్, జనార్ధన్ రెడ్డిలతో కలిసి పర్యవేక్షించారు. సర్టిఫికేట్ల వెరికేషన్‌కు సంబంధించి డిఎస్సి అభ్యర్థులతో జెసి ఆరాతీశారు. సర్టిఫికేట్ల దృవీకరణ సందర్భంగా అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా అధిగమించాలి అనే విషయంపై జెసి అధికారులకు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఎప్పటికప్పుడు మెరుగైన ఏర్పాట్లను చేయాలని ఉమ్మడి జిల్లాల డిఈఓలను జెసి ఆదేశించారు. నెట్ ప్రాబ్లమ్ వల్ల కొంత కౌన్సిలింగ్ ప్రక్రియ మూడు కేంద్రాల్లోనూ మందకోడిగా సాగింది.

**ఎస్‌జిటి జిల్లా ర్యాంకు సాధించిన లావణ్యకు అభినందన –** ఎస్‌జిటి విభాగంలో జిల్లా మొదటి స్థానం సాధించిన బి లావణ్యను పాఠశాల అడిషనల్ డైరెక్టర్ బి ప్రతాప్ రెడ్డి గురువారం రాయలసీమ యూనివర్సిటీ కౌన్సిల్ ప్రక్రియలో భాగంగా అభినందించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వి కరుణానిధి మూర్తి, కర్నూలు డిఈఓ శామ్యూల్‌పాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు.

# దొంగల్లుడు

**– ఇంటి వ్యక్తే దొంగ**

**– దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు**



స్వాదీనం చేసుకున్న బంగారు, వెండి



దొంగను పట్టుకొన్న పోలీసులు

**కోసిగి మేజర్ న్యూస్:** అక్క తమ్ముడి ఇంట్లో అక్క అల్లుడే ఇంటికి కన్నెంవేసి దొంగతనానికి పాల్పడి దొంగల్లుడుగా దొరిపోవడం జరిగింది. వివరాలలోకి వెళితే కోసిగిలోని 9వ వార్డులో యస్‌సి కాలనీలో నివాసం ఉంటున్న తుప్పడ భీమయ్య అనే రైల్వే ఉద్యోగి ఇంట్లో ఈనెల 21న దొంగతనం జరగడం జరిగింది. రైల్వే ఉద్యోగి భీమయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి తమ బంధువులైన చిర్తపల్లి గ్రామానికి వివాహానికి హాజురు కావడం జరిగింది. అయితే ఈ విషయాన్ని అక్క అల్లుడైన హనువాళ్ళు గ్రామానికి చెందిన ఈరన్న అనే వ్యక్తికి సమాచారం ఇచ్చి వెళ్ళడంతో వారిలేని సమయంలో ఇంట్లోకి వెళ్ళి రెండు బంగారు నెక్లెస్సులు, బంగారు రింగ్, రెండు జతల బంగారు కమ్ములు, 50తులాల వెండి దొంగలించుకొని పారిపోవడం జరిగింది. అయితే భీమయ్య వివాహాన్ని పూర్తిచేసుకొని ఇంటికి చేరుకోగా ఇంటితాళం పగలగొట్టి ఉండడంతో వెంటనే బీరువాదగ్గరకి వెళి చూడగా బీరువా ద్వంసంచేసి బీరువాలో ఉన్న బంగారు, వెండి కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అయితే యస్ఐ హనుంత రెడ్డి కేసు నమోదుచేసుకొని ధర్యాప్తుచేయగా తమ సొంత అక్క అల్లుడే దొంగతనానికి పాల్పడినట్లు సమాచారం రావ డంతో దొంగ ఈరన్నపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టడం జరిగింది. అయితే బుధవారం కోసిగిలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో అనుమాస్పదంగా ఈరన్న తిరుగుతున్నట్లు పోలీసులకు అనుమానం రావడంతో అతన్ని పట్టుకొని విచారించగా బంగారు నగలు, వెండి దొరికాయని సిఐ మంజునాథ్ తెలిపా రు. బంగారు, వెండిని స్వాదీనం చేసుకొని కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే యస్ఐ హనుమంతరెడ్డి, సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్ళు నజీర్, శ్రీనివాసు లు, కానిస్టేబుళ్ళు లక్ష్మినరాయణ, బాలకృష్ణ, నరేష్‌లను సిఐ అభినందించడం జరిగింది.

# రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోండి

- **వర్షానికి తడిసి రంగు మారిన మినుములను ప్రభుత్వం కొనుగోలు చేయాలి..**
- **ప్రభుత్వం ప్రకటించిన మద్ధత్తు ధర ప్రకారం మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే మినుములు కొనుగోలు చేయాలి.**
- **అన్ని పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి..ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం**



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలోని ఆళ్లగడ్డ, దొర్నిపాడు, సిరివెళ్ల, చాగలమర్రి, రుద్రవరం మండలంలోని చాలా గ్రామాల్లో అత్యధికంగా మినుము, మొక్కజొన్న పంటలు ముందుస్తు కురిసిన వర్షాల వల్ల సాగు చేశారు. అత్యధికంగా మినుము పంట సాగు చేసి రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంట కోత మిషన్ ఖర్చులు, కలుపు మందులు, కూలీల ఖర్చుతో కలిపి మొత్తం మీద ఒక్కొక్క ఎకరాకు సుమారు 20 వేల రూపాయలు ఖర్చు పెట్టారు. పరిస్థితులన్నీ సజావుగా ఉంటే ఎకరాకు 6 నుండి 8 బస్తాలు దిగుబడి వస్తుందని ఆశించారు. అయితే పంట చేతికి వచ్చిన దశలో ఆగస్టు నెలలో వరుసగా పది రోజులకు పైగా వర్షాలు కురవడం వల్ల మినుము పంట తీవ్రంగా నష్టం జరిగినది. ఫలితంగా ఎకరాకు మూడు నుండి నాలుగు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చినది. వాటిని కూడా కోసిన తర్వాత రోడ్లపై ఆరబెట్టుటకు రైతాంగం నానా తిప్పలు పడుతున్నారు. అధిక వర్షం కురవడం వల్ల దిగుబడి తగ్గడమే కాకుండా పండిన మినుములు కూడా కాస్త రంగుమారిపోయినవి. ఇది అదునుగా భావించిన మధ్య దళారీలు గ్రామాలకు వెళ్లి క్వింటా మినుములు రూ.2500 నుండి రూ.4000 రూపాయల లోపు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఒకవైపు వర్షాల వల్ల దెబ్బతిని మరోవైపు మధ్య దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను దోపిడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కానీ వ్యవసాయ అధికారులు కానీ నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి కనీసం పలకరింపుకైనా రావడం లేదు. ప్రభుత్వాలు మాత్రం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు ఆళ్లగడ్డ మండలంలోని గుబగుండం, పేరాయి పల్లె, భాగ్యనగరం గ్రామాల్లో పర్యటించి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. గూబగుండం వద్ద రైతులతో కలసి మీడియా తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈ నెలలో కురిసిన వర్షానికి పంట నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలనీ, ఆళ్లగడ్డలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి తడిసిపోయిన, రంగుమారిన పంట నంతటిని కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 7800 రూపాయలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, మధ్య దళారుల దోపిడీ నుండి, అధిక వర్షాల నుండి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గత ప్రభుత్వంలో పంటల బీమా ప్రీమియం ను ప్రభుత్వమే చెల్లించేదని ఫలితంగా వాతావరణ, దిగుబడి ఆధారిత బీమా పరిహారం వల్ల రైతాంగానికి మేలు జరిగేదని, ప్రస్తుత ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని నిబంధన పెట్టడంతో అత్యధిక మంది రైతులు ప్రీమియం చెల్లించలేదన్నారు. అందువల్ల రైతాంగం అన్ని రకాలుగా నష్టపోతున్నారూ . కావున రాష్ట్ర ప్రభుత్వమే అన్ని పంటలకు బీమా ప్రీమియం చెల్లించి రైతాంగం నష్టపోకుండా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**– సిబిఐ జిల్లా జడ్జి శోభారాణి**



మాట్లాడుతున్న జడ్జి శోభారాణి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కర్నూలు సిబిఐ జిల్లా జడ్జి శోభారాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రిలు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి కబర్థి సూచనల మేరకు ఐఐఐటి డిఎం రిజిస్టర్ రాజ్ కుమార్ మాంఝీవాల్ ఆధ్వర్యంలో గురువారం తాండ్రపాడులోని ట్రిపుల్ ఐటీ నందు విద్యార్థులకు ఎస్సి, ఎస్‌టి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం, ఎస్సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్, ర్యాగింగ్ వంటి చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ డీన్ సత్తిబాబు, ప్రొఫెసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్డియాలజీ విభాగంలో వినాయక చవితి వేడుకలు



**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగంలో హెచ్ఓడి ఆదిలక్ష్మి ఆద్వర్యంలో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైద్యులు డా. తనూజ్, డా. ప్రణీత్‌లు ఆదిపూజ్యుడు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కార్డియాలజీ విభాగంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ పూజలో వైద్య సిబ్బంది స్వాతి, రుక్మిణి, శిరీష, పావని, శైలజ, సుమిత్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

# సంచార చికిత్సను తనిఖీ చేసిన నోడల్ అధికారి



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కె.పి తాండలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర సమస్యలున్న గర్భిణులను క్రమబద్ధంగా సకాలంలో తరచూ వారిని ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పర్యవేక్షించాలన్నారు. గర్బవతుల ఆరోగ్య పరిస్థితులను కనుగొని అవసరమైన సలహాలు ఇవ్వాలన్నారు. మాతా, శిశు సంరక్షణ కార్డును పూర్తి సమాచారంతో నింపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. ఆనందరావు, ఆరోగ్య విద్య బోధకురాలు స్వరణ గౌరి, సామాజిక ఆరోగ్య అధికారి శ్వేతవాణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వెంకటరంగమ్మ, ధనిబాయి తదితరులున్నారు. అనంతరం ఉలిందకొండ చెరువులో, కొంగనపాడు వంకలో దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ముందుజాగ్రత్తగా గంబుషియా చేపల పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సుంకులమ్మ, సువర్ణా, ఎంపిహెచ్ఈఓ విజయ కుమారి, సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

# బనగానపల్లె పట్టణంలో పలు కాలనీలను పరిశీలించిన మంత్రి బి.సి



బనగానపల్లెమేజర్,న్యూస్ః బనగానపల్లె పట్టణంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్థన్ రెడ్డి ఆటోనగర్ సుబ్బారెడ్డి కోళ్లఫారం కాలనీలను పరిశీలించారు. ఆయా కాలనీలకు చెందిన వారు తమకు రోడ్డు సదుపా యం కల్పించాలని మంత్రి బి.సి జనార్థన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. సరైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు స్థంభించి పోతుందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. గతంలో బనగానపల్లె పట్టణంలో 30లక్షల సొంత నిధులతో భారీ ఎత్తున మొక్కలు నాటిన గతంలో ఆయా మొక్కలను ప్రత్యేకంగా పరిశీలించి వాటి సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# తిరుపతి రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని



**సంజామలమేజర్,న్యూస్ః** సంజామల మండలం ముక్కమల్ల గ్రామం దాసి తిరుపతి రెడ్డి కుమారుడు దాసి చైతన్య రెడ్డి (20) ఈనెల 24వ తేదీన మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వారి స్వగృహానికి వెళ్లి తిరుపతి రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అవుకు మండల వైకాపా కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైకాపా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, ముక్కమళ్ల గ్రామ వైకాపా నాయకులు పోచా వెంట్రామిరెడ్డి, పోచా రామిరెడ్డి, శనివారపు వెంకట సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ కనక వెంకట రమణ, నీలి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ జంటనే అతని ఆస్తి

- పోలీస్ అంటూ దోపిడీ
- దోపిడీదారుడికి ఇంటి దొంగలే సహకారం



దొంగలు, కారును చూపుతున్న సిఐ విక్రమసింహ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగర శివారులోని ప్రేమజంటలను గోర్లగట్ట నాగేంద్రుడు అలియాస్ నాగేంద్ర అనే వ్యక్తి ఆస్తిగా చేసుకుని అమ్మాయిలు, అబ్బాయిల జీవితాలతో ఆడుకుంటూ వారి జీవితాలను బజారు పాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా జగన్నాథ గట్టు, పాత పంప్‌హౌస్, కాదాంబరి వెంచర్, వెంగన్నబావితో పాటు నగరంలోని వివిధ ఖాళీ ప్రదేశాలు, కాలేజీల వద్ద ప్రేమికులను టార్గెట్ చేస్తూ వారు మాట్లాడుకుంటున్నప్పుడు వీడియోలు తీసి వారి వద్ద నుండి నగలు, నగదు దోచుకోవడం పరిపాటిగా మార్చుకున్న ఆ వ్యక్తి మరో నలుగురితో కలిసి ముఠాగా ఏర్పడి ఇదే వృత్తిని ఎంచుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నాగేంద్రతో పాటు మరో ఇద్దరిని గురువారం 4వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు 4వ పట్టణ సిఐ విక్రమసింహ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన కల్లూరు ఎస్టేట్‌కు చెందిన ఓ యువతి, డోన్‌కు చెందిన ఓ యువకుడు తాలుక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశం వైపు ఆటోలో వెళుతుండగా ఆటోను వెంబడించి హ్యాంగ్‌ఔట్ హోటల్ దాటిన తర్వాత ఆటోను ఆపి అమ్మాయి, అబ్బాయిల ఫోటోలు తీసి మీ తల్లిదండ్రులకు పంపుతానని కత్తితో బెదిరించి అమ్మాయి వద్దనున్న బంగారు గొలుసు, అబ్బాయి వద్ద నుండి రూ.2వేలు నగదు ఫోన్‌పే చేయించుకుని, జేబులో ఉన్న రూ.1000లు లాక్కొని తిరిగి రెండ్రోజుల తర్వాత అమ్మాయికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయగా బాధితురాలు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా మొబైల్ ఆధారంగా దొంగ గోర్లగట్ట నాగేంద్రుడును గుర్తించిన పోలీసులు కర్నూలు–బెంగళూరు హైవే వద్ద ఉన్నకైరా కేఫ్ వద్ద గోర్లగట్ట నాగేంద్ర, ప్రజానగర్‌కు చెందిన కురువ రమేష్, దిన్నెదేవర పాడు గ్రామానికి చెందిన దూదేకుల మాలిక్ బాషాలను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.10,500ల నగదు, బంగారు చైను, ఒక కారు, ఒక స్కూటీ, ఒక కత్తి, డిక్కీలో 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందని సిఐ విక్రమసింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోహన్ కిషోర్ కుమార్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు రాముడు, క్రైం పార్టీ సిబ్బంది జీనస్, మురళీ, ఖాద్రి, షాకీర్, కానిస్టేబుళ్లు, సుబ్బరాయుడు, ఎల్లా శివుడు, వెంకటేష్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిదొంగల సహకారం :- గత కొన్నేళ్లుగా వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న కొందరు ఇంటిదొంగల సహకారంతోనే ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. గతంలో కూడా ఇతనికి తోడుగా ఉంటూ సహకరిస్తున్న ఓ కానిస్టేబుల్‌ను కూడా అప్పట్లో పై అధికారులు జైలుకు పంపారు. ఆ తర్వాత మరికొంతమంది పోలీసుల సహకారం తీసుకుని ఈ దందాను కొనసాగిస్తున్నట్లు బాధిత ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం కూడా ఇందులో మరో ముగ్గురు ఇంటి దొంగలు ఉన్నారని వారిపై కూడా పోలీసు ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు మీమావేషాలు లెక్కిస్తున్నట్లు బాధిత ప్రజలు, పోలీసు శాఖలోని కొందరు చర్చించుకుంటున్నారు.

## టిటిడి ఛైర్మెన్ బిఆర్ నాయుడును కలిసిన తిక్కారెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తిక్కారెడ్డి వెంట కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్‌రెడ్డి ఉన్నారు.



ఛైర్మన్ బిఆర్ నాయుడుతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

## ఏపీ బీజేపీ అధికార ప్రతినిధులుగా నరసింగరావు, వినూషరెడ్డి





**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కాదర్‌బాద్ నరసింగరావు, మరియు వినూషరెడ్డి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి నంద్యాల జిల్లా న్యాయవాదులు, బీజేపీ శ్రేణులు, ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. నరసింగరావు కుటుంబం స్వాతంత్రానికి పూర్వం నుంచే దాతృత్వానికి, సేవకు మారుపేరుగా నిలిచింది. అటువంటి కుటుంబం నుంచి వచ్చిన వారు హైందవ ధర్మాన్ని ముందుకు తీసుకెళ్తూ, ప్రజలను జాగృతిపరుస్తూ, సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడు ముందుంటున్నారు. వారు గత ఎన్నికల్లో బీజేపీ తరపున ఎన్టీఆర్ జిల్లాకు పార్టీ పరిశీలకులుగా క్రియాశీలక బాధ్యతలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన వినూషరెడ్డిని, నరసింగరావును అధికార ప్రతినిధులకు నియమిస్తూ బిజెపి అధిష్టానం నియామక పత్రాలను జారీ చేసింది.

# రైతులకు విజయడైరీ రూ.22కోట్ల సహాయం

- నాలుగు అంశాలపై ప్రత్యేక దృష్టి
- నాలుగేళ్ల పదవి కాలంలో రైతులకు, కార్మికులకు చారిత్రాత్మక లాభాలు
- విజయ డైరీ ఛైర్మెన్ ఎస్‌వి జగన్మోహన్‌రెడ్డి

నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :విజయడైరీ పాడి రైతులకు రూ.22కోట్ల సహాయాన్ని అందించిందని విజయ డైరీ ఛైర్మెన్ ఎస్‌వి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. విజయడైరీలో ప్రధానంగా నాలుగు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నాలుగేళ్ల పదవి కాలంలో రైతులకు, కార్మికులకు చారిత్రాత్మక లాభాలు అందించామన్నారు. ఆయన మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ వివరాలు అందించారు. విజయడైరీ పాడి రైతులకు, కార్మికులకు ఎన్నడూలేని స్థాయిలో మేలు చేశామన్నారు. పాడి రైతులు ప్రక్కకు పోకుండా ప్రోత్సహించామన్నారు. రైతులు విజయడైరీకే పాలు సరఫరా చేయడానికి ఇదే ప్రధాన




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయ డైరీ ఛైర్మెన్ ఎస్‌వి జగన్మోహన్‌రెడ్డి

కారణమన్నారు. పాడి రైతులకు నాలుగేళ్లలో రూ.17, ఉద్యోగులు, కార్మికులకు రూ.3.50 కోట్ల బోనస్ అందించామన్నారు. గేదెల కొనుగోలు కోసం రైతులకు 20శాతం రాయితీ కింద రూ.1.10లక్షలు అందించామన్నారు. మరణించిన రైతుల కుటుంబాలకు రూ.15లక్షల సహాయం చేశామన్నారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులే విజయ డైరీకి బ్యాక్ బోన్ అన్నారు. ఆధునీకరణ, భారీ వ్యాపంర 2024–2025లో విజయడైరీ వార్షిక వ్యాపారం రూ.310 కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం రోజుకు 1.30లక్షల లీటర్ల పాలుసేకరిస్తున్నామన్నారు. 1.20లక్షల పాలు అమ్మకం జరుగుతోందన్నారు. రూ.36 కోట్లతో డైరీ మరమ్మత్తులు, ఆధునీకరణ చేపట్టామన్నారు. విజయ డైరీ అభివృద్ధి కోసం ఇంకా ఎంతో చేయాల్సి ఉందన్నారు. సహకార సంస్థలు నిలబడటం కష్టమని అనుకున్నానని, రైతుల నమ్మకం, సహకారంతో విజయ డైరీ విజయపథంలో ముందకు సాగుతోందన్నారు. రైతులకు మరింత మేలు చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఆ వైపుగా కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులకు మరింత మంచి జరిగే వరకు కష్టపడతానన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం – మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. గురువారం నాడు బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో వారు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఒక్క బనగానపల్లె నియోజకవర్గం నుండే కాక నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి బి.సికి వినతీపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యాన్ని ఇస్తున్నామని అన్నారు. వచ్చిన అర్జీలలో కొన్నింటికి వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వార ఆదేశాలు జారీ చేశారు. అర్జీలన్నింటిని ఆయా శాఖల అధికారులకు పంపించి వారి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి బి.సి తెలిపారు.




అర్జీలను స్వీకరిస్తున్న దృశ్యం

## టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా నంద్యాల టిబి క్లీనిక్‌లో నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.వెంకటరమణ ఆధ్వర్యంలో టిబి వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ మిత్ర ద్వారా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఇందులో నంద్యాల డిఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ ఇద్దరు టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నారు. అలాగే డిఎల్‌ఏటిఓ డా.సరితాబాయి ఒకరిని, శివపార్వతి రెడ్డి 10 మందిని, డిఎల్‌ఏటిఓ కార్యకర్తల వైద్యులు ముగ్గురిని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రంగాల వారు, ప్రముఖులు టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున ఆరు నెలలకు రూ.3 వేలు విలువ చేసే పౌష్టికాహారం అందించాల్సి ఉంటుందన్నారు. డా.సరితాబాయి మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తులకు మంచి పౌష్టికాహారం అందించడంతో త్వరగా ఆరోగ్యవంతులవుతారని అన్నారు. ప్రతి ఒక్కరు టిబి వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు తేజశ్వని, పీటర్ వసంత్, వినయ్, జిల్లా పిపిఎమ్ కోఆర్డినేటర్ నాగార్జున్ రెడ్డి, టిబి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు

## సంఘపట్నం ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభించిన ఉగ్రసేనా రెడ్డి

**అవుకుమేజర్,న్యూస్:** 2019 మార్చి నెలలో నాటి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని అప్పటి ఎమ్మెల్యే బి.సి జనార్ధన్ రెడ్డి ఎంతో కష్టపడి ఒప్పించి 2కోట్ల60లక్షలు తీసుకువచ్చి పనులు చేయడం జరిగింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలకులు ఐదేళ్లుగా అటువైపు కన్నెత్తి చూడకుండా వదిలేయడం వలన మెయింటెనెన్స్ చేయకుండా వదిలివేయడం వలన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి పైపులైన్ వేసే సమయంలో పైపులు డ్యామేజ్ అవడం జరిగింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే మన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి దాదాపు మూడున్నర లక్షల సొంత ఖర్చులతో పైపులన్నీ రిపేరి చేయించి ఈరోజు సంఘపట్నం చెరువుకు నీరందించడం జరిగింది. 255 ఎకరాలకు ప్రత్యక్షంగా 145 ఎకరాలకు పరోక్షంగా నీరందించిన మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డికి అవుకు మండల ప్రజలు, రైతుల తరపున సంఘపట్నం గ్రామ ప్రజలు, రైతుల తరపున కృతజ్ఞతలు తెల్పుకుంటున్నానన్నారు.



## షెడ్యూల్డ్ కులాల జిల్లా కమిటీ ఎన్నిక

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు అధ్యక్షతన నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నూతన కమిటి షెడ్యూల్డ్ కులాల ఉద్యోగుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. అదే విధంగా అసోసియేషన్ బలోపేతం చేయడానికి కృషి చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షులుగా లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్, వైస్ ప్రెసిడెంట్‌గా కిరణ్ కుమార్, సుచేత, విజయకుమార్, జనరల్ సెక్రటరీ అర్జున్ రావు, తదితర కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.



సూర్య www.suryaa.com



# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

**-ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



గణేష్ నిమజ్జన ఊరేగింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ఈనెల 31వ తేదీన ఎంతో అంగరంగ వైభవంగా ఆదోని పట్టణంలో గణేష్ నిమజ్జనం జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం డీఎస్పీ హేమలత, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ రమేష్‌లతో కలిసి ఆయన పట్టణంలో వినాయకులు నిమజ్జనానికి వెళ్ళు ప్రధాన మార్గాలైన తిక్కస్వామి దర్గా, ఎమ్మిగనూరు సర్కిల్, బీమాస్ సర్కిల్, శ్రీనివాస్ భవన్, గణేష్ సర్కిల్, న్యూ ఫ్లైఓవర్, వినాయక ఘాట్ మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా గణేష్ విగ్రహాల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. గణేష్ విగ్రహాలు వెళ్లే దారిలో రోడ్డు ప్యాచ్ వర్క్‌ను త్వరతగతిన పూర్తి చేయాలని అంతే కాకుండా ముఖ్యమైన ప్రదేశాలలో బారికేడ్లను కూడా ఏర్పాటు చేయాలని ఆర్అండ్ బీ అధికారులకు సూచించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డంకులు లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కెనాల్ దగ్గర గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అదేవిధంగా నిమజ్జనం ప్రాంతాల్లో వైద్యాధికారులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జన కార్యక్రమం నిర్వహించే ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సమయంలో క్రేన్లు గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో ఆదోనిలో ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని అధికారులను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు.

# సూపర్ సిక్స్..సూపర్ హిట్



సభకు తరలివచ్చిన మహిళలు

**డోన్,మేజర్‌న్యూస్:** సూపర్‌సిక్స్‌పథకంలోఒకటైన స్త్రీశక్తి(మహిళలకు ఉచిత బస్సు) విజయవంతం కావడంతో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపులో భాగంగా డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మల పిలుపుమేరకు గురువారం చేపట్టిన సూపర్ సిక్స్....సూపర్ హిట్ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గంలోని మహిళలు వేలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలు ముఖ్య అతిధులుగా హజరైయ్యారు. ముందుగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి పాతబస్టాండ్ వరకు వేలాదిగా తరలివచ్చిన మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సమైక్యాంధ్ర కట్ట వద్ద ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు హామిగా ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు కావడంతో అవి రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ హిట్ అయ్యాయాన్నారు. సూపర్‌సిక్స్ పథకాలలో ఐదు పథకాలనువిజయవంతంగాఅమలుచేయడంతో,అందులో భాగంగా అమలు అవుతున్న ముఖ్యమైన పథకాలు వృద్ధులకు నెలకు రూ.4వేలు పింఛన్, ప్రతి సంవత్సరం మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకం, రైతులకు అండగా అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రజలలో మంచి ఆదరణ పొందాయన్నారు. కావున రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు, ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచి గెలిపించాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి కోరారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళ స్వావలంబనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. ఈ పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక బలాన్ని ఇవ్వడమే కాకుండా సమాజంలో మరింత గౌరవాన్ని కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా డోన్ మెప్మా అర్బన్ పరిధిలోని 296 స్వయం సహాయక సంఘాల సభ్యురాలకు రూ.250.75కోట్లు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయబడ్డాయని, అలాగే డోన్ రూరల్ పరిధిలోని 1122 స్వయం సహాయక సంఘాలకు రూ.104.34 కోట్లు విడుదల అయ్యాయన్నారు. ఈ మెగా చెక్కును సంబందిత మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ నిదులు మహిళ సంఘాల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతనిధులు, మహిళలు పాల్గొన్నారు.

# నాలుగు మెడికల్ సీట్లు సాధించిన రావూస్ కళాశాల విద్యార్థులు



**నంద్యాలటౌన్,మేజర్ న్యూస్ :** నంద్యాల పట్టణంలోని రావూస్ కళాశాల విద్యార్థులు నాలుగు మెడికల్ సీట్లు సాధించినట్లు కళాశాల చైర్మన్ అప్పారావు తెలిపారు. యు నంద కిషోర్ అనే విద్యార్థి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో, లక్ష్మీ శైలజ అనే విద్యార్థిని నంద్యాల లోని శాంతిరామ్ మెడికల్ కళాశాలలో, నాగ చంద్రకుమార్ అనే విద్యార్థిని నెల్లూరులోని ఏ సి ఎస్ ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఐ వెంకట త్రినాథ్ రెడ్డి నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల లో మెడికల్ సాధించినట్లు కళాశాల చైర్మన్ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అప్పారావు డైరెక్టర్ మోని చంద్ర, ప్రిన్సిపల్ సుంకయ్య అభినందించారు.

# సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించాలంటూ ప్రార్థించా..



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గాజులదిన్నె గ్రామంలో వినాయక చవితి సందర్భంగా వరసిద్ధి వినాయకుడిని ప్రతిష్టించి కురువ సంఘం, తెలుగుయువత నాయకుల ఆధ్వర్యంలో కురువ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రాన్ని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సుభిక్షంగా పాలించాలి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటు రామకృష్ణ గాజుల దిన్నె మత్స్యసహకారసంఘం ఆధ్యక్షుడు రంగస్వామి, ప్రత్యేక పూజలు విఘ్నేశ్వర సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల పాటు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమం చేపట్టారు.

# పాములపాడు మండలంలో మొక్కలు పంపిణీ



**పాములపాడు మేజర్ న్యూస్ :** మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంద్వారా 100% సబ్సిడీతో రైతులకు పండ్ల మొక్కలు సరఫరా చేశామనిఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, హరితహారం లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు విస్తృతంగా పాల్గొని మొక్కలను నాటాలని. కోరారు ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్లూర్‌లో రాష్ట్రస్థాయి భజన పోటీలు

**కృష్ణగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పుట్లూర్ గ్రామంలో శ్రీ మాత మారెమ్మ తిరుణాల సందర్భంగా సెప్టెంబర్ 1న సోమవారం రాత్రి ఉమ్మడి తెలుగు రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తామని ఆ గ్రామ పెద్దలు చెప్పారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 4 వరకు శ్రీ పుట్లూర్ మారెమ్మ మాత తిరుణాల వార్షిక బ్రహ్మోత్సవాలను చేపడతామన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భజన పోటీలలో గెలుపొందిన ప్రథమ విజేతకు బహుమతిగా రూ 20 వేలు అందిస్తామన్నారు. ద్వీతియ బహుమతిగా రూ 15 వేలతో పాటు 12వ బహుమతి వరకు నగదు బహుమతులను అందజేస్తామని వారు తెలిపారు. అలాగే ఉత్తమ హార్మోనిస్టుకు, తబలిస్టుకు, గాయకునికి తగిన బహుమతులను అందిస్తామని వారు పేర్కోన్నారు.

# మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికా రులతో ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డిసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై సమీక్షించారు. అలాగే చిరు వ్యాపారస్తుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ చిరు వ్యాపారస్తులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పట్టణంలోని ఆయా వార్డులో పెండింగ్ ఉన్న అభివృద్ధి పను లను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఈ నీరజ, ఏఈలు మదన్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎగువ అహోబిలంలో విరిగి పడ్డ కొండ చెరియలు..తృటిలో తప్పిన ప్రమాదం



కొండచరియ విరిగిపడి చెట్లు, కరెంటు స్తంభం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** మండలంలోని ఎగువ అహోబిల ంక్షేత్రంలో మెట్లమార్గంలోబుధవారం తెల్లవారుజామున కొండ చెరియ విరిగి పడి చెట్టు, కరెంట్ స్తంభం నేల కూలాయి. ఈ సమయంలో భక్తులు ఎవరు మెట్ల పైన సంచారం లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు తెగి పడిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు సప్లై నిలిపి వేసి మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ ఏడిఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వెంటనే చర్యలు తీసుకుని సిబ్బందిని పంపించి విద్యుత్ లైన్ మరమ్మతులు చేసి దేవస్థానానికి విద్యుత్ సరఫరా పున రుద్ధరించారు. అలాగే ఎంపీడీవో నూర్జహాన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

# నాలుగు దశాబ్దాలు దిగ్విజయంగా ..



**డోన్,మేజర్‌న్యూస్:** డోన్ పట్టణంలోని పాత పేట అశ్వతామ కట్ట దగ్గర నిర్వహించే వినాయక ఉత్సవాలు దిగ్విజయంగా నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్నాయి.కాలనీలోని యువత ఆధ్వర్యంలో ప్రతి ఏటా వినాయకచవితి సందర్భంగా వినాయకుని విగ్రహం ఏర్పాటుచేసి ఉత్సవాలు నిర్వహిస్తారు.నలబై సంవత్సరాలు నిర్విరామంగా ఎలాంటి లోటు లేకుండా ఉత్సవాలు నిర్వహించడం అంత సులువైనది కాదు.కాలనీ లోని ప్రజల ఐకమత్యము,తోడ్పాటు వలననే ఇది సాధ్యమైందని నిర్వాహకులు తెలిపారు. దివంగత నేత ఆర్.ఈ. రవికుమార్ కుటుంబం ప్రతి ఏటా మొదటి పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.రాబోయే రోజుల్లో కూడా ఇలానే ఉత్సవాలు ఘనంగా నిర్వహి స్తామని నిర్వాహకులు తెలిపారు.

# నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరుపుకోవాలి



సీఐ విజయభాస్కర్

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రశాంతగా జరుపుకోవాలని సీఐ విజయభాస్కర్ అన్నారు. ఆయన మాట్లాడుతు వినాయక భక్త బృంధ సభ్యులు గోనెగండ్ల గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉదయం 10 గంటలకు నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించి సాయంత్రం 6గంటలలోపు పూర్తి చేయాలన్నారు. వినాయక విగ్రహలను స్థానిక గాజులదిన్నె ప్రాజెక్టు లో నిమజ్జనం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రాజెక్టు లోపలకు వెళ్లరాదని నీరు ముందుజాగ్రత్తలు పాటించాలని కోరారు. ఊరేగింపులలో డీజేలకు వాడకూడదని మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే వారి పై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పేద ఇంట్లో వెరిసిన విద్యాకుసుమం

**-టీచర్ ఉద్యోగం సాధించిన బోయ చిన్న హనుమంతు -ఆనందంలో తల్లి తిమ్మక్క కుటుంబం**



**తుగ్గలి ,మేజర్‌న్యూస్ :**తుగ్గలి మండలం పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ గ్రామంలో కూలీ పనికి పోయే బోయ తిమ్మక్క కుమారుడు బోయ చిన్న హనుమంతకు ఉపాధ్యాయ ఎస్‌జిటి పోస్టుకు ఎంపికయ్యారు. దీంతో ఆకుటుంబం ఆనందంలో ముంచెత్తింది. తుగ్గలి మండలము పెండేకల్లు ఆర్ఎస్ గ్రామానికి చెందిన బోయ తిమ్మక్క గత కొన్ని సంవత్సరాల నుండి కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈమెకి ఎనిమిది మంది కుమారులు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఎనిమిది ఎనిమిదో వాడు బోయ చిన్న హనుమంతు టిటిసి పూర్తి చేసుకుని గతంలో జరిగిన మెగా డీఎస్సీలో పరీక్ష రాయడం జరిగింది. దీంతో బోయ హనుమంతు 1255 రాష్ట్ర ర్యాంకును సాధించారు.బిసి లో 64.53014 మార్కుల్లో రావడంతో బీసీఏ కోటాలో ఎంపిక కావడం జరిగింది.పేద కుటుంబంలో పుట్టిన బోయ చిన్న హనుమంతు ఎస్జిటిలో ఉద్యోగం సంపాదిం చడం ఆ కుటుంబంలో ఆనందంలో ముంచేత్తారు. బోయ చిన్న హనుమంతు ఎస్జిటిలో టీచర్ పోస్ట్ కావడంతో పెండేకల్లు ఆర్ఎస్ గ్రామానికి చెందిన ప్రజలు జనసేన పార్టీ నాయకులు రాజేష్ హర్షం వెలిబుచ్చారు.

# కొలువుదీరిన గణనాథులు

**చాగలమర్రి,మేజర్‌న్యూస్ :** చాగలమర్రి మండలంలో 89 చోట్ల గణనాథులుకొలువుదీరారు. మండలంలో ఇప్పటివరకు 89 గ్రహాలు నిలబెట్టడం రికార్డు స్థాయిలో ఉంది. అయితే ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు, భక్తులు వ్యవసాయ పనులు





**కొలువుదీరిన గణనాథుడు ,అన్నదానం చేస్తున్న దృశ్యం**

నిమగ్నమయి నాకమయ్య పండుగ మంచి శుభప్రదంలో రావడంతో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా గణనాథులను నిలబెట్టడం జరిగింది చాగలమర్రిలోనే 24 గణనాథులను ఏర్పాటు చేయగా 65 గణనాథులు మండలంలోని అన్ని గ్రామాల్లో నిలబెట్టడం జరిగింది. ఈసందర్భంగా గణనాథుడికిప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం, పూజలు కోలాటాలు ఏర్పాటు చేయడంజరిగింది, మండలంలోని చిన్న వంగలిఏడు గ్రహాలు, చింతల చెరువులో ఏడు, ఏర్పాటు చేయగా ఆయా గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ ఇలా ఆధ్వర్యంలో పూజలు అన్నదానకార్యక్రమాలు,ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై సురేష్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనంతరం చాగలమర్రిలోని రామాలయం, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకసమీపంలో కొలువుదీరిన గణనాథులను, కుల మతాలకతీతంగా ప్రముఖ వ్యాపారవేత్త, బేస్బాల్ జిల్లా అధ్యక్షులు, చక్రం సంస్థల అధినేత, షబ్బీర్ అహ్మద్ విగ్రహాల ఏర్పాటు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఆయనను పలువురు అభినందించారు.

# ఆదోనిలో వినాయకుల సందడి

**భక్తులతో కిటకిటలాడుతున్న గణేష్ మండపాలు**

**ఆదోనిటౌన్,మేజర్‌న్యూస్:** ఆదోనిలో బుధవారం వినాయకచవితి వేడుకలు అంబరాన్నంటాయి. ఇంటింటా గణనాథున్ని ప్రతిష్టించి.. కుటుంబ సభ్యులంతా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.పార్వతీతనయుడికి ఇష్టమైన పిండివం టలు, నైవేద్యాలను సమర్పించారు.అలాగే ఈ ఏడాది కూడా పట్టణంలో ఎక్కడికక్కడ వినా యకుడి ప్రతిమలు భారీస్థాయిలో వెలిశాయి. వివిధ రూపాల్లో ఉన్న భారీ గణనాథులను వాహనాల్లో డప్పుచప్పులు, మంగళ వాయిద్యాల నడుమ మండపాలకు తరలించి ప్రతిష్టించారు. గణేష్ నిర్వాహకులు, భక్తులు రకరకాల హంగులతో విద్యుత్ దీపాలంకరణతో గణేష్ మండపాలనుఎంతోరమణీయంగా తీర్చిదిద్దడంతో ఆదోనిలో



**దర్శనమిస్తున్న మూషిక వాహనుడు**

వాడవాడలా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. రాజకీయ ప్రముఖులు, భక్తులు రెట్టించిన ఉత్సాహాలతో ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక పరవశం చెందారు. వివిధ రూపాల్లో రూపుదిద్దుకున్న గణనాథుని విగ్రహాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రెండవ రోజైన గురువారం పట్టణంలోని వినాయక మండపాల వద్ద భక్తుల తాకిడి మరింత పెరిగింది. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో ప్రారంభించిన ఆదోని పుర ప్రజలు, భక్తులు ఐదు రోజులపాటు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

# గురురాజాలో ఘనంగా క్రీడా దినోత్సవం వేడుకలు

**గురు రాజా విద్యా సంస్థ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న గురురాజ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 29 మేజర్ ధ్యాన్చంద్ జయంతి పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో వివిధ క్రీడలను నిర్వహించడంతో ఈ క్రీడలను ప్రారంభించడానికి



ముఖ్యఅతిథిగా గురు రాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలి రెడ్డి విచ్చేసి క్రీడలనుప్రారంభించి, చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని క్రీడల ద్వారా పోటీ తత్వాన్ని అలవర్చుకునే గుణాన్ని క్రీడల ద్వారా స్నేహభావంతో కలిగి ఉండటం మరి ఎన్నోఅంశాలుక్రీడల ద్వారా నేర్చుకోవచ్చని గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలి రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు చక్కటి సందేశాన్ని అందజేసి గెలుపు ఓటమి సమానంగా స్వీకరించాలని కోరారు, ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు డిపి రాజు, సందీప్, సంజీవ,ముని,శశి,వెంకటరెడ్డి, తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

# లూజు మట్టితో సైడ్ ట్రాక్ నిర్మాణం

**బురదమయం అయినా సైడ్ ట్రాక్**

**ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు**

**ఆళ్లగడ్డ,మేజర్‌న్యూస్ :** రుద్రవరం మండలం లోనిరుద్రవరం ఎర్రగుడిదిన్నె గ్రామాల ప్రధాన రహదారిలో ఉన్న వాగుపై రూ 1 కోటి46 లక్షల నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే సంబంధిత కాంట్రాక్టర్లు వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అంతరాయం లేకుండా వెళ్లేందుకు సైడ్ ట్రాక్ నాణ్యతగా ఏర్పాటు చేస్తారు. అయితే రుద్రవరం ఎర్రగుడుదిన్నె ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం పనులు దగ్గర సంబంధిత కాంట్రాక్టర్లు సైడ్ ట్రాక్ ను లూజు మట్టితో



ఏర్పాటు చేశారు. ప్రస్తుతము వర్షాలు కురుస్తుండడంతో లూజుమట్టి బురదమయం కావడంతో వాహనాలు దారులు ప్రయాణం చేసే సమయంలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్న కంబలూరు, నుంచి సిరివెళ్ల వెళ్లే ప్రధాన రహదారి సరిగా లేకపోవడంతో నంద్యాలకు వెళ్లే ప్రయాణికులు వాహనదారులు రుద్రవరం నుంచి ఎర్రగుడిదిన్నె మీదుగా రోజు వందలాది వాహనాలు వెళుతుంటాయి. ఈ వాహనదారులు బ్రిడ్జి దగ్గర ఏర్పాటు చేసిన సైడ్ ట్రాక్ బురదమయం కావడంతో ప్రయాణికులు వాహనదారులు మోటార్ సైకిల్ నుంచి కిందపడి గాయాల బారినపడుతున్నారు.దీంతోఆయా గ్రామాల ప్రజలుఎన్నో ఇబ్బందులు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు సైడ్ ట్రాక్ ను నాణ్యతగా నిర్మించి ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికులు వాహనదారులు కోరుతున్నారు.

# జ్ఞానప్రదాత బొజ్జ గణపయ్యకు జేజేలు

(మొదటి పేజీ తరువాయి)



**నూతన మౌక్తిక కవచ అలంకరణలో స్వామివారు**

చవితి వచ్చిందంటే పెద్దలు, చిన్నారులు సైతం ఎంతో ఉత్సాహంగా పట్టణాల్లో 5 రోజులు.. గ్రామాల్లో 3రోజులు...నగరాల్లో 9రోజులు..ఇలా ఆయా ప్రాంత ప్రాధాన్యతను బట్టి స్వామివారిని ప్రతిరోజు ఎంతో నిష్టగా పూజలు చేస్తారు. పండితుల ఆధ్వర్యంలో మండపాల వద్ద భక్తులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తారు. స్వామికి 21 పత్రాలతో గణపతి పూజ చేస్తే ఎంతో సంతోషిస్తాడని పేర్కొంటారు. ఈ21 రకాల పత్రి పూజలు చేస్తే ఆరోగ్య ప్రయోజనాలు ఉండడంతో మన పూర్వీకులు పండుగకు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 27వ తేదీ నుంచి ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలు నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో భక్తులు పర్యావరణానికే ఎక్కువగా ప్రాధాన్యతను ఇచ్చారు. రెండో రోజు సంజీవనగర్ కోదండ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీకదళీ పూర్ణఫల మహాగణపతిగా అరటికాయలతో మహాగణపతిని అలంకరించగా.. కార్తికేయ శర్మ ఆచార్యత్వంలో శ్రీసిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభంగా కొనసాగింది. అలాగే బాలాజీ కాంప్లెక్స్‌లోని కల్యాణ మండపంలో 39వ వార్షికోత్సవం పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణలో భాగంగా సప్తగవ్వలతోత మహాగణపతిని అలంకరించారు. నత్త గవ్వలు, మూడు రకాల శంఖులు, రెండు రకాల ముత్యపు చిప్పలు, రెండు రకాల గోమతిచక్రాలతో అలంకరణ చేశారు. అర్చకులు గోపినాథ్ నిర్వహణలో ఉపాధ్యక్షులు కశెట్టి చంద్రశేఖర్, కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శుక్రవారం ప్రపంచ శాంతి కొరకు విశ్వశాంతి మహా గణపతి హోమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని బైర్మల్‌వీధిలో శ్రీగజానన్ మహారాజ్ యువజన సంఘం



**అరటికాయలతో అలంకరించిన దృశ్యం**

సభ్యులు పవన్ కల్యాణ్, చైతన్య, వంశీ, చిన్ను, సన్నీ, తదితరుల ఆధ్వర్యంలో త్రిశూలధారి గణపతిని ఏర్పాటు చేయగా ప్రతి రోజు మహిళలు కోలాటాలు, చిన్నారుల ఆటపాటలను ఏర్పాటు చేయగా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం సాయంత్రం హనుమాన్ భజన ఏర్పాటు చేశారు. రమేశ్ శర్మ ఆచార్యత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

# ఆకర్షణగా 53 లక్షల విలువతో వెండిబిస్కెట్‌ల వినాయకుడు

**★తులసీపూసల వినాయకుడితో కొండవీడు ప్రాంతం**

**★కొలువుదీరిన పార్వతీపుత్రుడు .. బివి, బుట్టా ఎర్రకోటల పూజలు**

**★నేడు దిగువకాలువలో నిమజ్జనం**

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** వినాయకచవితి వేడుకల్లో బాగంగా ఎమ్మిగనూరు కోర్టు రోడ్డులో కొలువుదీరిన గణపయ్య 53 లక్షలు విలువ చేసే వెండి బిస్కట్లుతో అలంకరణతో పట్టణంలో ఆకర్షనగా నిలిచిచారు. ఇక్కడ ఏటా ఓ ప్రత్యేకతగా వినాయకుడు కొలవు దీరుతారు.. గతేడాది 55 లక్షల నోట్లతో అలంకరణ చేపట్టారు అక్కడి వినాయక మండలి వారు. అలాగే కొండవీడు ప్రాంతంలో కూడా ఈ ఏడాది తులసీ పుసల అలంకరణతో వినాయకుడు దర్శనం ఇస్తున్నారు. సోమప్ప నగర్‌లో తామరపూల విత్తనాలతో వినాయకుడు కొలువై ఉన్నారు అక్కడ వినాయక మండపంలో భక్తుల కోలాహాలం నెలకుంది.ఇలా గ్రామ, గ్రామాన వాడవాడల బొజ్జ గణపయ్య భక్తుల మొక్కులు అందుకుంటున్నారు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయ నాగేవ్వరరెడ్డి వివిద ప్రాంతాల్లో కొలువుగా ఉంచిన వినాయకులు దర్శించుకుని మొక్కుకున్నారు. నా నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆదిపూజితుడు విఘ్నేనరాయలును కోరుకున్నారు. అలాగే వైకాపా సమన్వయకర్త బుట్టారేణుక, బుట్టా శివనీలకంఠప్ప, రాష్ట్ర వైకాపా యువజన విభాగం ఉపాద్యక్షలు బుట్టా ప్రతుల్ వైకాపా పార్టీ కార్యలయం ఆవరణలో వినాయకున్ని కొలువుగా నిలిపి ప్రజల సుభిక్షం కోరుతూ వేదపండితుల చేత అభిషేకం, వినాయక వ్రతం చేయించి పూజలు చేపట్టారు. అనంతరం వినాయక విగ్రహాలను సందర్శించి భక్తులకు వినాయక చవితి శుబాకాంక్షలు తెలుపుకున్నారు. వైకాపా కర్నూలు పార్లమెంట్ రాష్ట్ర ఉపాద్యక్షలు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, యువనాయకులు ఎర్రకోట రాజీవ్‌రెడ్డి వినాయకుల కొలువున్న చోట దర్శనం చేపట్టి అక్కడ ఘనంగా పూజలు చేపట్టారు. మూడు రోజుల పాటు వినాయకునికి ఆయా మండపాల్లో పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టి నేడు తుంగభద్ర దిగువకాలువలో నిమజ్జనం చేపడతారు. ఇందుకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డిఎస్‌పి బార్గవి, సిఐలు శ్రీనివాసులు, మదుసుదన్‌రావులు ఆద్వర్యంలో గట్టిపోలీస్ బందోబస్తు చేపడతున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ కమీషనర్ గండిరెడ్డి అక్కడ నిమజ్జనంకు ఏర్పాట్లు చేపట్టారు.








# శ్రీశైలం డ్యాంకు స్వల్పంగా తగ్గిన వరద..

**9 గేట్ల ద్వారా సాగర్ కు కొనసాగుతున్న నీటి విడుదల**

**ఇన్ ఫ్లో 21,94,577 క్యూసెక్కులు**

**అవుట్ ఫ్లో 2,29,639 క్యూసెక్కులు**



డ్యామ్ 9 గేట్ల ద్వారా సాగర్ కు విడుదలవుతున్న నీటి దృశ్యం.

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా వరద ప్రవాహం తగ్గింది.దీంతో డ్యాం 10 గేట్లల్లో ఒక గేటును గురువారం సాయంత్రం మూసివేసి 9 గేట్ల ద్వారా 2,23,119 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేశారు.రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 65,620 క్యూసెక్కులు అదనంగా విడుదలైంది. సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల,సుంకేసుల ప్రాజెక్టుల ద్వారా 1,94,577 క్యూసెక్కుల వరద నీరు వచ్చి శ్రీశైలానికి చేరింది.ప్రస్తుతం డ్యామ్ నీటిమట్టం 882 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 198.8120 టీఎంసీలుగా నమోదైంది.కాగా జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ 30 వేల క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ కు 2,824 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.నీటి ఆవిరి రూపంలో 58 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.అలాగే గడిచి 24 గంటల వ్యవధిలో కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 26,455 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 13.296 మిలియన్ యూనిట్లు,ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 39,292 క్యూసెక్కుల నీటితో 16.801 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.రాత్రి వేళలో ప్రవాహం మరింతగా తగ్గితే మరికొన్ని గేట్లను మూసి వేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఒకవేళ ప్రవాహం పెరిగితే 10 గేట్లను ఎత్తివేస్తామన్నారు.

**శ్రీశైలం డ్యాం సమీపంలో పడిన కొండరాళ్లు** : శ్రీశైలం డ్యాం సమీపంలో కొండరాళ్లు రోడ్డుపై జారి పడ్డాయి. డ్యాం గేట్ల నుంచి విడుదలవుతున్న నీటి జల్లుల,రెండు రోజులుగా శ్రీశైలం పరిసరాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కారణంగా డ్యాం, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రం మార్గమధ్యంలో రహదారిపై రాళ్లు పడ్డాయి.ఈ ఘటన తెల్లవారుజామున జరగటంతో ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.శ్రీశైలం వచ్చే భక్తులు ఘాట్ రోడ్డులో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి...

**– ఆదోని సబ్ కలెక్టర్**



వినాయక ఘాట్ పరిశీలన ఏర్పాట్లు సూచిస్తున్న డిఎస్పీ

**ఆదోని, మేజర్ న్యూస్ :** గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం ఆదోని పట్టణంలో నిమజ్జనం వెళ్లే ప్రధాన దారి అయినా, తిక్క స్వామి దర్గా, ఎమ్మిగనూరు సర్కిల్, భీమాస్ సర్కిల్, ఫరిసామొహల్లా, శ్రీనివాస్ భవన్, గణేష్ సర్కిల్, న్యూ ఫ్లైవర్ వినాయక ఘాట్ ప్రధాన దారులను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, నిమజ్జనంకు ఏటువంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా గణేష్ విగ్రహాల ఊరేగింపులో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తుతో నిమజ్జన ఏర్పాట్లు చేయాలని పోలీసులకు ఆదేశించారు. విగ్రహాలు వెళ్లే దారిలో రోడ్లో ఉండే ప్యాచ్ వర్క్‌ను తరువాత గతిన పూర్తి చేయాలని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయాలని, అర్అండ్‌బి అధికారులకు ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లను అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో క్రేన్లు గతంలోకంటే ఎక్కువ సంఖ్యలో ఉంచుకొని ఏటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖల సమన్వయంతో నిమజ్జనం విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ హేమలత, తహశీల్దార్ రమేష్, మున్సిపల్ కమీషనర్ కృష్ణ, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలి

**– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్**

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి పలు ప్రభుత్వ అంశాలపై సమీక్షించారు.గురువారం సాయంకాలం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విజయవాడ నుండి అన్ని జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మైనర్ఇరిగేషన్ ట్యాంక్‌లు, గ్రౌండ్ వాటర్ లెవెల్, పెన్షన్ లు,యూరియా సరఫరా పి. ఎం. కుసుమ్ కు మరియు ఎయిర్ ఫోర్స్ కొరకు భూమి సేకరణ,జూవైనల్ కేసులు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ వంటి మెదలగు విషయాలు చర్చించి తగు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ... అర్హులైన వారందరికీ పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ విషయం లో జిల్లా కలెక్టర్ లు ప్రత్యేక దృష్టి తో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డాక్యుమెంట్ అప్లోడ్ చేసే కార్యక్ర మాన్ని వేగవంతం చేయించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సబ్ స్టేషన్ లకు మరి యు ఇతర ప్రభుత్వ అవసరాలకు భూములు వీలైనంత త్వరగా అందించే చర్యలు తీసు కోవాలని సూచించారు.కలెక్టర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఈ సమావేశానికి జెసి డాక్టర్ బి.నవ్య,అడిషనల్ ఎస్పి హుసేన్ పీరా, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి,ఇరిగేషన్ సిఈ బాలచంద్రారెడ్డి, డిఆర్డిఏ పి.డి రమణారెడ్డి, డ్వామా పిడి వెంకట రమణయ్య,కర్నూలు మున్సిపల్ కమీషనర్ విశ్వనాధ్, డిపిఓ భాస్కర్, జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి, పి ఆర్ ఎస్ ఈ మద్దన్న,ట్రాన్సకో ఈఈ ఓబులేసు, ఐసిడిఎస్ పిడి విజయ, గ్రౌండ్ వాటర్ డిడి శ్రీనివాసులు, మైనారిటీస్ ఆఫీసర్ సాబీహాపర్వీన్, డి ఎం మార్క్‌ఫెడ్ గద్వాల్ రాజు మొదలగు అధికారులు పాల్గొన్నారు.

## భూ అక్రమణ దౌర్జన్యాలను సహించేది లేదు

**– గెలివి కుటుంబంపై దాడి అమానుషం – టిడిపి అండగా నిలుస్తుంది**

**– పరిష్కారానికి న్యాయస్థానాలు, పోలీసులు**

**– మంత్రి ఫరూక్**



పాత్రికేయులతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

**నంద్యాల, మేజర్న్యూస్ బ్యూరో :** నంద్యాల జిల్లాలో భూ అక్రమ ణ దౌర్జన్యాలను సహించేది లేదని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. గెలివి కుటుంబంపై దాడి అమానుషమన్నారు. నంద్యాలలో గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి న్యాయస్థానాలు, పోలీసులు ఉన్నారని గుర్తు చేశారు. గెలివి కుటుంబంపై దాడిని సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. గెలివి రామక్రిష్ణ, చైతన్యలపై భౌతికంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. నంద్యాల ప్రజలు ఇలాంటి సంఘటనలు సహించరని గుర్తు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదన్నారు. అటువంటి వారిపై ఇప్పటికే చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖను ఆదేశించామన్నారు. గెలివి కుటుంబానికి మంచి పేరు ఉందన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలు ఏవైనా ఉంటే న్యా యవాదులు, పోలీసులకు చూపించి పరిష్కరించుకోవాలన్నారు. గెలివి కుటుంబానికి పార్టీ పరంగా తప్పక న్యాయం చేస్తామన్నారు.

## ప్రహారీ గోడ నిర్మాణానికి భూమి పూజ



ప్రహారీగోడ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీజీ వెంకటేష్

**కర్నూలు, మేజర్న్యూస్ :** నగరంలో కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న పురాతన ఎల్లమ్మ ఆలయ ప్రహారీగోడ పునర్నిర్మాణానికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆలయాన్ని పరిశీలించి ఆలయ ప్రహారీగోడ నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు. ప్రహారీగోడ నిర్మాణానికి సంబంధించి పలు సలహాలు, సూచనలు అందచేశారు. అనంతరం టీజీ వెంకటేష్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి, శివ, స్థానిక నాయకులు తెలుగు మహేష్, తిమ్మారెడ్డి, వీరప్ప, సాయినాథ్‌తో పాటు భజరంగ్ నాయకులు పాల్గొన్నారు.

## మార్కెట్‌యార్డుకు పోటెత్తిన ఉల్లి

**– పడిపోయిన ఉల్లి ధర**

**కర్నూలు జడ్పి, మేజర్న్యూస్ :** కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లి ఉత్పత్తులు పోటెత్తాయి. ధరలు చూస్తే నేలచూపు చూశాయి. యార్డుకు గురువారం రోజు 8,428 ఉల్లి బస్తాలు రాగా కనిష్ట ధర రూ.520లు, గరిష్టంగా రూ.1149లు, మధ్యధర రూ.739లు పలికింది. వేరుశనగ 5800బస్తాలు రాగా కనిష్టంగా రూ.2079లు, గరిష్టంగా రూ.7109లు పలికింది. ఆముదాలు 480బస్తాలు రాగా కనిష్ట ధర రూ.5800లు, గరిష్టంగా రూ.6130ల ధర పలికింది.

## భాజాపా రాష్ట్ర అధికార ప్రతినిధులుగా వినూష, నరసింగరావు

**– ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి అవకాశం ఇచ్చిన మాధవ్**

**కర్నూలు, మేజర్న్యూస్‌బ్యూరో :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు అవకాశం దక్కింది. గురువారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పిఎన్ మాధవ్ రాష్ట్ర అధికార ప్రతినిధుల పేర్లను ప్రకటించగా, డాక్టర్ వినూషారెడ్డి ( కర్నూలు), కెబిఎన్‌బి నరసింగరావు ఉరఫ్ బ్రహ్మం (నంద్యాల) నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 మందికి అధికార ప్రతినిధులుగా అవకాశం ఇవ్వగా, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం దక్కడం విశేషం. వీరిని జిల్లా నేతలు అభినందించారు.

## స్వచ్ఛ బనగానపల్లెగా తీర్చిదిద్దుతాం



లారీని ప్రారంభిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ :** బనగానపల్లెను స్వచ్ఛ బనగానపల్లెగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్థన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామ పంచాయితీలో లేని విధంగా మొట్టమొదటిసారిగా బనగానపల్లె గ్రామ పంచాయితీకి స్మార్ట్ కంప్యాక్ట్ లారీని 56లక్షలు మరియు 28 డస్ట్‌బిన్‌లు 12లక్షల4వేలకు కొనుగోలు చేసినట్లు మంత్రి బి.సి తెలిపారు. బనగానపల్లె పట్టణంలో చెత్తకుండీలు లేక ఎక్కడపడితే అక్కడ చెత్తను విరివిగా పడేయడంతో స్థానికంగా ఉండే జంతువులు, కుక్కలవల్ల ఆ పరిసరాలంతా అపరిశుభ్రంగా తయారయ్యాయని అన్నారు. తన సతీమణి బి.సి ఇందిరమ్మ నా బనగానపల్లె నా ఆరోగ్యం అంటూ నూతన కార్యక్రమాన్ని శ్రీకారంచుట్టి బనగానపల్లె పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేస్తున్నారన్నారు. వీటన్నింటికి పరిష్కారంగా నూతన డ్రస్ట్‌బిన్‌లను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రజలంతా చెత్తను డ్రస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలని ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా పారవేయవద్దని తెలిపారు. చెత్తకుండీలను కూడా ఎప్పటికప్పుడు స్మార్ట్ కంప్యాక్ట్ లారీతో క్లీనింగ్ చేసి స్వచ్ఛ బనగానపల్లెగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, నాగరాజు, ఈ.ఒ సతీష్ కుమార్ రెడ్డి, తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## వరద నీటితో ఉప్పొంగిన భవనాశి



ఉధృతిని పరిశీలిస్తున్న సిఐ రాము

**ఆత్మకూరు, మేజర్న్యూస్:** ఆత్మకూరు ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనాశి వాగు ఉప్పొంగి పారుతుంది. దీంతో కురుకుంద గ్రామం, కొత్తపల్లి మండలంలోని గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విఆర్ఎస్పి నిండడంతో గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో భవనాశి వాగుకు భారిగా వరద నీరు చేరడంతో పట్టణ శివార్లలోని ఇటుకల బట్టిల వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు భవనాశి వాగు వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. నందికుంట, కొత్తపల్లి మండలంలోని గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వాహన దారులు పోలీసులకు సహకరించాలని సిఐ రాము కోరారు.